బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కౌశికహరి, బీఆర్ఎస్ శ్రేణులు

# అందరికీ రుణమాఫీ చేయాల్సిందే

- రైతుబంధు విడుదల చేయాలి
- తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నాకు దిగిన బీఆర్ఎస్ నేత కౌశికహరి
- అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

పాలకుర్తి, సెప్టెంబర్21: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేయకపోవడం, రైతుబంధు నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి ఆధ్వర్యంలో శనివారం తహసీల్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను పోలీసులు అడుగగడుగున అడ్డుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి రామగుండంలో కౌశికహరి ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. ఆయన వారి కళ్లుగప్పి అజ్ఞాతంలోకి వెళ్లాడు. శనివారం ఉదయం 10గంటలకు తహసీల్ ఎదుట పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా కు దిగిన కౌశికహరి, బీఆర్ఎస్ కార్యకర్తలను బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, శ్రీరాంపూర్ ఎస్ఐ వెంకటేశ్ బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఒక దశలో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వందల సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ ఆదేశాల మేరకు కౌశికహరి, బీఆర్ఎస్ శ్రేణులు శాంతించారు. మధ్యాహ్నం వరకు బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకుని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేయాలని, రైతుబంధు వెంటనే విడుదల చేయాలని కౌశికహరి డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు బండారి శ్రీవాణి కిరణ్, ఆడపు శ్రీనివాస్, బయ్యపు దేవేందర్‌రెడ్డి, చింతి కింది సత్యనారాయణ, మేరుగుపోచం, కొల్లూరి సత్యసతీశ్, బండారి ప్రవీణ్, ధరణిరాజేశ్, కొలిపాక శరణ్యమధుకర్‌రెడ్డి, ఖాదర్‌పాషా, సంగేమ్ సదానందం, ముల్కల కొమురయ్య, మదన్‌మోహన్‌రావు, ముత్యం లక్ష్మణ్‌గౌడ్, కేశోరాం కార్మిక సంఘం నాయకులు మదాసు శ్రీనివాస్, తోడేటి రవికుమార్, వెల్పుల సంపత్, బత్తిని సతీశ్ గౌడ్, పున్నం శశికుమార్, కొండ నారాయణగౌడ్, నాగరాజు, నెరువట్ల సతీశ్, ఎంచర్ల మహేశ్, చందనవేని రాజయ్య, కొండ కుమార్, కొమ్ము శ్రీనివాస్, కొండకృష్ణ, మంత్రి రామచంద్రం పాల్గొన్నారు.

కౌశికహరి, పార్టీ శ్రేణులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

### పోలీసుల అత్యుత్సాహం అమానుషం

జ్యోతినగర్ (రామగుండం), సెప్టెంబర్ 21: రైతు రుణమాఫీ, రైతుబంధు నిధులు విడుదల చేయాలని పాలకుర్తి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నాకు బీఆర్ఎస్ నేత కౌశికహరి పిలుపుతో శనివారం ఉదయం 6గంటలకు కౌశికహరి ఇంట్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం అమానుషమని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రకటనలో ఖండించారు. పోలీసులు ఎవరి అనుమతితో ఇంట్లోకి వచ్చారో చెప్పాలని బీఆర్ఎస్ కార్యర్తలు మద్దికుంట శంకర్, దారంగుల కుమార్, కుక్క గంగాప్రసాద్, బోనగిరి కుమార్, శెట్టి రాజశేఖర్ డిమాండ్ చేశారు.

లాభాల వాటా చెల్లింపులో

# కార్మికులకు తీవ్ర అన్యాయం

గోదావరిఖని: ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

- ₹1,550 కోట్ల లాభాల్లో ₹796 కోట్లే పంచుతరా..?
- ప్రభుత్వ మోసంతో ఒక్కో కార్మికుడికి రూ.2లక్షల మోసం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబర్ 21: సింగరేణి లాభాల్లో వాటా చెల్లింపులో సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ₹70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి, రికార్డుస్థాయిలో బొగ్గు రవాణా చేశారన్నారు. బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నా, అంగవైకల్యం పొందుతున్నా ఎలాంటి భయానికి లోను కాకుండా దేశాభివృద్ధి కోసం పాటుపడిన సింగరేణి కార్మిక వర్గాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థ 2022-23 వార్షిక సంవత్సరంలో ₹2,222 కోట్లు లాభాలు ఆర్జించిందని చెప్పారు. అదే 2023-24 వార్షిక సంవత్సరానికి ₹4,701 కోట్లు నికర లాభం వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొన్నదని, అందులో కార్మికులకు 33శాతం వాటా అంటే ₹1,550 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానీ కేవలం ₹796 కోట్లు మాత్రమే ఇవ్వడం వెనుక మతలబు ఏంటో చెప్పాలన్నారు. ప్రతి కార్మికుడికి లాభాల్లో వాటా కింద ₹4లక్షలు రావాల్సి ఉందని, కానీ ప్రభుత్వం చేసిన మోసానికి గెలిచిన కార్మిక సంఘం సైతం వంతు పాడడం వల్ల ఒక్కొక్కరికి ₹2లక్షలు లాభాలు తగ్గించబడ్డాయని ఆరోపించారు. లాభాల వాటా చెల్లింపులో ప్రభుత్వం, సింగరేణి గుర్తింపు సంఘం చేసిన మోసాన్ని ఎండగట్టాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులకు జరిగిన నష్టంపై కలిసివచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని పోరాడతామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిందన్నారు. గతంలో ప్రభుత్వం జోక్యం ఉన్నప్పటికీ అది సంస్థ అభివృద్ధికి, కార్మిక సంక్షేమానికి ఉపయోగపడిందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు, రెండు పీహెచ్‌ల పెంపు, గృహ నిర్మాణానికి రూ.పది లక్షల రూపాయలపై వడ్డీ చెల్లింపు, ఒక శాతం బిల్లు మాఫీ, కార్మికుల తల్లిదండ్రులకు ఉచిత కార్పొరేట్ వైద్యం, తదితర ప్రయోజనాలు ఒనగూరిన విషయాన్ని కార్మికులు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను ఆలోచించి కార్మికులకు న్యాయంగా రావాల్సిన ₹1,550 కోట్ల లాభాలను పంచాలని డిమాండ్ చేశారు. ఇక్కడ టీబీజీకేఎస్ నాయకులు మాదాసి రామ్మూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పోలాడి శ్రీనివాసరావు, వాసర్ల జోసఫ్, చల్ల రవీందర్‌రెడ్డి, బొగ్గుల సాయి, రాజ్‌కుమార్, పల్లె సురేందర్, జనగామ మల్లేశ్, పులిపాక శంకర్, రోడ్డ సంపత్, సతీశ్ ఉన్నారు.

### కార్మికుల పక్షాన పోరాడుతాం

యైటింక్లయిన్‌కాలనీ: గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నరసింహారావు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 21: సింగరేణి లాభాల వాటాలో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని, వారి పక్షాన పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహరావు ఆరోపించారు. శనివారం ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3 కృషి భవన్‌లో డివిజన్ కార్యదర్శి కుంట ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2023-24 వార్షిక సంవత్సరంలో ₹4,701కోట్ల లాభాలు వచ్చినప్పటికీ ₹2,412 కోట్ల మీద 33 శాతం ఇచ్చారని గుర్తుచేశారు. ఇందులో ₹2,289 కోట్లు సంస్థ అభివృద్ధికి వెచ్చిస్తామని చెబుతున్నప్పటికీ, దేనికోసం ఖర్చు చేస్తారో యాజమాన్యం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో యాజమాన్యం నిజాయితీగా పని చేయడం లేదని, ఈ క్రమంలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక్కడ ఉల్లి మొగిలి, సారంగం, వినేశ్, సంపత్‌కుమార్, రాంప్రసాద్, నర్సింహ, భూమయ్య, తదితరులు ఉన్నారు.

### కార్మికులను నట్టేట ముంచిన సర్కారు

పెద్దపల్లి, సెప్టెంబర్21(నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులను నమ్మించి నట్టేట ముంచింది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రజలందరినీ మోసం చేస్తూ వస్తున్న సర్కారు.. ఇప్పుడు సింగరేణి కార్మికులకు కుచ్చుటోపీ పెట్టింది. వారి చెమట కష్టాన్ని దోచుకుంది'' అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా ధ్వజమెత్తారు. 2023-24 సంవత్సరానికి సింగరేణి సంస్థకు ₹4,701 కోట్ల నికర లాభం వస్తే అందులో కేవలం ₹796 కోట్లు కార్మికులకు ఇచ్చి.. 33 శాతం ఇచ్చామని అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. అంత పెద్ద మొత్తంలో లాభాలు వచ్చినప్పుడు ఎందుకు వాటిని పంచకుండా.. అందులోంచి ₹2,289 కోట్లు దాస్తున్నారని మండిపడ్డారు. కేవలం ₹2,412 కోట్లను లాభంగా చూపించిందన్నారు. వాస్తవానికి ₹4,701 కోట్లలో కార్మికులకు 33 శాతం వాటా ఇస్తే.. ఒక్కో కార్మికునికి ₹3.70లక్షలు వచ్చేవని, కానీ సర్కారు కుట్ర పూరితంగా వ్యవహరించి ₹లక్షా 90 వేలు ఇచ్చి చేయి దులుపుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది కార్మికులకు 32 శాతం వాటాను పంచి ఇచ్చిందని, ఆ ఏడాదిలో సంస్థకు వచ్చిన నికర లాభం ₹2,222 కోట్ల నుంచి 32 శాతం అంటే.. ₹700 కోట్లు కార్మికులకు పంచిందని, కానీ ఇప్పుడు లాభాలు ఎక్కువగా వచ్చాయని, అందులో ఎక్కువ వాటా ఇస్తే కార్మికులు సంతోషపడేవారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులంటే రేవంత్‌రెడ్డికి గిట్టడం లేదని, సింగరేణి ప్రాంత ప్రజలు వారికే పట్టం కట్టినా కనికరం చూపకుండా సంస్థకు వచ్చిన లాభాలను సగందాచుకుని.. పిసరంత మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇప్పుడు కార్మికులకు ఇచ్చింది కేవలం 16.9 శాతం వాటా మాత్రమేనని తెలిపారు. దాన్ని కూడా గొప్ప పనిగా పబ్లిసి టీ చేసుకుంటున్నారని, దీన్ని మించిన దుర్మార్గం, నీచమైన పని మరొకటి ఉండదని మండిపడ్డారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి: కలెక్టర్

పెద్దపల్లి, సెప్టెంబర్21: ప్రభుత్వ దవాఖానల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలపై కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణుల నమోదు తక్కువగా ఉందని, వంద శాతం రిజిస్టర్ అయ్యేలా చూడాలన్నారు. కనీసం 80శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో జరగాలని ఆదేశించారు. ఎక్కువగా జ్వరాలు నమోదవుతున్న గ్రామాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ డీఎంహెచ్‌వో డాక్టర్ కే ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కే శ్రీధర్, ఏడీపీహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఈర్ల స్వరూప

పెద్దపల్లి, సెప్టెంబర్21: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్‌గా ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్‌గా కూర మల్లారెడ్డి, సభ్యులుగా కొమ్ము కరుణాకర్, సోమ చంద్రయ్య, మాడగొని శ్రీనివాస్, కొలిపాక కనకయ్య, వేగోళపు పెద్ద రాజేశం, పిట్టల కొమురయ్య, ఎండీ గౌస్‌మియా, గోప తి సదానందం, కొల్లూరి రామచంద్రం, తిప్పారపు ప్రభాకర్, సరోత్తమ్ రెడ్డి, ఎడ్ల మహేందర్‌తోపాటు పొత్కపల్లి పీఏసీఎస్ చైర్మన్, డీఎంవో, ఏడీఏ, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సభ్యులుగా నియమించారు.

## 17మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

గోదావరిఖని, సెప్టెంబర్ 21: సింగరేణి ఆర్జీ-1 పరిధిలో 17 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను జీఎం డీ లలిత్‌కుమార్ శనివారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెడికల్ ఇన్ వాలిడేషన్, చనిపోయిన ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగుల డిపెండెంట్స్ వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీఎంవోఏఐ జాయింట్ సెక్రటరీ రావుల దామోదర్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, పీవో శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

## 'ట్రినిటీ'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

విద్యార్థులను అభినందిస్తున్న చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 21: పట్టణంలోని స్వరూప గార్డెన్‌లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ ప్రిన్సిపాల్స్ ఓదెలు, అనిల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 21: లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం సాధ్యమని గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ మంజుల పేర్కొన్నారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని మున్సిఫ్ కోర్టు హాల్‌లో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో నిర్వహించిన లోక్‌అదాలత్ సమన్వయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షణికావేశంలో కేసుల పాలై సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. ఇక్కడ మున్సిఫ్ కోర్టు ఏపీపీ నహీదా పర్వీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, కే లింగమూర్తి, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఉన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

సుల్తానాబాద్, సెప్టెంబర్ 21: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి డీ గణేశ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో శ్రీవాణి జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన హాజరయ్యారు. అనంతరం కళాశాల యాజమాన్యం జడ్జిని సత్కరించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, జనరల్ సెక్రటరీ రమేశ్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజం, లోక్ అదాలత్ సభ్యులు పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, అలూరి శ్రీనివాస్‌రావు, జోగుల రమేశ్, న్యాయవాదులు బాలకిషన్ ప్రసాద్, రవీందర్, సర్వోత్తమ్‌రెడ్డి, ఆవునూరి సత్యనారాయణ, నేరెళ్ల శంకరయ్య, బోయిని భూమయ్య, దూడం ఆంజనేయులు, సామల రాజేంద్రప్రసాద్, ఆవుల శివకృష్ణ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, ప్రిన్సిపాల్ కమలాకర్, శ్రీనివాస్ ఉన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 21: విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జిల్లా స్పెషల్ జడ్జి డా టీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం న్యూ మారేడుపాక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్‌రావుతో కలిసి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ హెచ్ఎం స్వర్ణ, న్యాయవాది భూమయ్య ఉన్నారు.

## ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలి

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 21: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్యయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి అమరవీరుల స్తూపం వద్ద పాటలు ఆలపిస్తూ నినదించారు. ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 27న హైదరాబాద్ కళాభవన్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ నాయకులు రాజేశం, శ్రీనివాస్, రాజేశం, కుమార్, సందీప్, రవి, సంపత్, నర్సయ్య, మల్లయ్య, శ్రీను, స్వప్న, రాధిక ఉన్నారు.

## భారీ శబ్ధం వచ్చే సైలెన్సర్లు ఉపయోగించవద్దు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 21: భారీ శబ్ధం వచ్చే సైలెన్సర్లను ఉపయోగించకూడదని రామగుండం ట్రాఫిక్ సీఐ పీ రాజేంద్రప్రసాద్, ఎస్ హరిశేఖర్ సూచించారు. శనివారం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వాహన తనిఖీలో శబ్ధం వచ్చే సైలెన్సర్ వాహనాలకు జరిమానా విధించారు.

## రూ.938కే విద్యుత్ కనెక్షన్ పొందండి

పెద్దపల్లి, సెప్టెంబర్21: 500వాట్స్ కోసం ₹938, అలాగే 250 వాట్స్ కోసం ₹818 చెల్లించి కొత్త మీటర్ కనెక్షన్ పొందవచ్చని పెద్దపల్లి ఎస్ఈ బొంకూరి సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త విద్యుత్తు మీటర్ కనెక్షన్ కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదని, విద్యుత్ శాఖకు చెందిన అన్ని సెక్షన్ (ఏఈ) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే సత్వరమే కనెక్షన్ మంజూరు చేస్తామని తెలిపారు. త్వరలో రెండో విడుత ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో ఆ లోగా మీటర్ కనెక్షన్ పొందితే గృహ జ్యోతి పథకానికి అర్హులయ్యే అవకాశం ఉందన్నారు.

## రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీ, సెప్టెంబర్ 21: గోదావరిఖనిలో ప్రధాన నాలాపై నిర్మించిన సాయిలీలా బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈమేరకు రామగుండం నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి ఆసాల నవీన్, తదితరులు ఉన్నారు.

## బోనస్ చెల్లించాలి

జ్యోతినగర్ (రామగుండం), సెప్టెంబర్ 21: రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్‌కు బోనస్ చెల్లించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మల్టీపుల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ శనివారం రామగుండం రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డిపో ఏడీఎంఈ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. బోనస్ చెల్లింపుపై గతంలో పలుమార్లు యూనియన్ పక్షాన అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించగా చెల్లింపునకు ఒప్పుకొన్నట్లు తెలిపారు. సత్వరమే కార్మికులు, ఎన్‌హెచ్‌లకు బోనస్‌ను చెల్లించాలని కోరారు. ఇక్కడ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ప్రసాద్ ఉన్నారు.

## విద్యుత్ అధికారుల 'పొలంబాట'

పెద్దపల్లి, సెప్టెంబర్ 21: విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని పెద్దపల్లి ఎస్ఈ బొంకూరి సుదర్శన్ శనివారం తన చాంబర్‌లో వెల్లడించారు. వంగిన పోల్స్, లూస్ లైన్స్ సరి చేస్తున్నామని, మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు లేకుండా మెరుగైన సరఫరా అందించడానికి పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## వరి పంటకు ఎండాకు తెగులు

ఓదెల, సెప్టెంబర్ 21: వరి పంటలకు ఎండాకు తెగులు సోకడంతో శనివారం పలు గ్రామాల్లో రైతుల పొలాలను వ్యవసాయాధికారులు శనివారం పరిశీలించారు. ఓదెల, కొలనూర్, గోపరపల్లి గ్రామాల్లో పర్యటించి తెగులును గుర్తించారు. ఈ తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ ఎకరాకు 400 గ్రాములు లేదా స్ట్రెప్టోసైక్లిన్ సల్ఫేట్ 60 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. అగ్గి తెగులు గమనిస్తే ట్రై సైక్లోజోల్ పిచికారీ చేయాలన్నారు. ఇక్కడ ఏవో భాస్కర్, ఏఈవోలు సంధ్య, రాకేశ్, రైతులు ఉన్నారు.

## ఇంటింటా సర్వే పూర్తి చేయాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమా సురేశ్‌రెడ్డి

మంథని, సెప్టెంబర్ 21: మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఇంటింటా సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని చైర్‌పర్సన్ పెంద్రి రమా సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అదే విధంగా పట్టణంలోని 13వ వార్డు పెంజేరుకట్టలో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ సూపరింటెండెంట్ మనోహర్, మెప్మా డీఎంసీ సతీశ్, పాలకవర్గ సభ్యులు కొట్టె పద్మ రమేశ్, చొప్పకట్ల హనుమంతు, విజయలక్ష్మి, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

**'కాకతీయ'లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ**

స్థానిక కాకతీయ పాఠశాల విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమాసురేశ్‌రెడ్డి, సూపరింటెండెంట్ మనోహర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ కౌన్సిలర్ వీకే రవి, ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ధర్మారం, సెప్టెంబర్ 21: ప్రైవేట్ పాఠశాలలకు వచ్చి అకారణంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ స్కూల్ కరెస్పాండెంట్లు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు ప్రైవేట్ స్కూళ్లకు వచ్చి బెదిరిస్తున్నారని, డబ్బులు ఇవ్వకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు బుధారపు మహేందర్, జైన సురేశ్‌కుమార్, పాములపర్తి శ్రీనివాస్, వడ్లూరి కిరణ్‌కుమార్, ఎల్లాల అనంతరెడ్డి, డీ మల్లేశం, బిడారి సతీశ్, మందపల్లి లక్ష్మణ్, జక్కని ఆశిష్, మహ్మద్ రసూల్ పాల్గొన్నారు.

## ప్రగతినగర్‌లో ఉచిత వైద్యశిబిరం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 21: నగరంలోని 39వ డివిజన్ ప్రగతినగర్‌లో శనివారం మాజీ కార్పొరేటర్ సోమారపు లావణ్య, లయన్స్‌క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. లయన్ వైద్యులు వనజ, రాపోలు, లక్ష్మీవాణి కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇక్కడ లయన్స్‌క్లబ్ మగువ కార్యదర్శి బీనా సింగ్, కోశాధికారి పద్మ, సభ్యులు ఉన్నారు.

## వందశాతం హాజరుకు సహకరించాలి

ఓదెల, సెప్టెంబర్ 21: విద్యార్థులు వందశాతం పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షేక్ కోరారు. ఓదెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం పద్మ అధ్యక్షతన శనివారం పీటీఎం సమావేశం జరిగింది. అనంతరం పాఠశాల అవరణలోని కిచెన్ గార్డెన్‌లో వంకాయ, టమాట, మిర్చి మొక్కలను నాటారు. ఇక్కడ ఏఎస్‌వో ఎండీ అజీముద్దీన్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

## 'మతమా..మానవత్వమా' బృందానికి సత్కారం

కోల్‌సిటీ, సెప్టెంబర్ 21: ఇటీవల హైదరాబాద్‌లో బెస్ట్ షార్ట్ ఫిలీం అవార్డు అందుకున్న 'మతమా... మానవత్వమా..' లఘుచిత్రం బృందాన్ని శనివారం నియర్ అండ్ డియర్ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక మార్కండేయ కాలనీలో జరిగిన అభినందన సభలో పలువురు హాజరై మాట్లాడారు. గోదావరిఖనికి చెందిన కళాకారుడు దామెర శంకర్ 'మతం కన్నా మానవత్వం మిన్న' అనే కథాంశంతో స్వీయరచన, దర్శకత్వంలో నిర్మించిన లఘు చిత్రానికి అవార్డు రావడం సంతోషకరమన్నారు. దర్శకుడు శంకర్, నటులు మేజిక్ రాజా, రాపెల్లి కుమార్, రాజలింగు, రాజేశ్, మహబూబ్‌ను శాలువాతో సన్మానించారు. ఇక్కడ నియర్ అండ్ డియర్ అధ్యక్షుడు అమరేందర్, శంకర్, సర్వేశ్, వేణుమాధవ్ ఉన్నారు.

## ఈజీఎస్ కార్యవర్గం ఎన్నిక

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్, సెప్టెంబర్ 21: ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నూతన కార్యకర్గాన్ని శనివారం సుల్తానాబాద్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుడుదల కుమారస్వామి (నారాయణపూర్), ఉపాధ్యక్షురాలిగా కోడూరి శారద, జనరల్ సెక్రటరీగా నల్లగొండ రమేశ్, కోశాధికారిగా శీలం లక్షణ్, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వెల్పుల మల్లయ్య, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఏపీవో మల్లీశ్వరి, జేఈ రాజు, నారాయణపూర్ మాజీ ఎంపీటీసీ మండల రమేశ్, తదితరులు నూతన కార్యవర్గానికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

## బిల్ కలెక్టర్ సస్పెండ్

పెద్దపల్లి, సెప్టెంబర్21: మంథని మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన ఇంటి పన్ను ₹50వేలు పెండింగ్‌లో ఉండగా, ఫిబ్రవరిలో బిల్ కలెక్టర్ రాజుకు ₹25వేలు (₹14వేల నగదు, ₹11వేలు ఫోన్ పే) చెల్లిస్తే ₹647మాత్రమే రసీదు ఇచ్చాడని మంథని పట్టణ నివాసి సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ ఈ నెల 19న ఫిర్యాదు చేశాడు. సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు ఆధారాలను పరిశీలించి బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో బిల్ కలెక్టర్ మంథని హెడ్ క్వార్టర్ అనుమతి లేకుండా వదిలి వెళ్లొద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్‌గా మద్దెల

కోల్‌సిటీ, సెప్టెంబర్ 21: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్‌గా గోదావరిఖనికి చెందిన సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్‌ను నియమించారు. ఈమేరకు శనివారం డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఈ నియామకాన్ని ప్రకటించారు. అలాగే కో-కన్వీనర్‌గా బండారి సదానందం, సభ్యులుగా కే రాజారత్నం, ఎర్రల రాజయ్య, రమేశ్, ఆరెపల్లి మానస్‌కుమార్, చంద్రగిరి ఉదయ్‌ను నియమించారు.

## ఉన్నతస్థాయికి చేరుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 21: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షేక్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ అజీముద్దీన్ పేర్కొన్నారు. సుద్దాలలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులతో తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశాన్ని సందర్శించారు. అనంతరం పాఠశాలలోని రూమ్ టూ రీడ్ లైబ్రరీ, జిల్లాలో మొదటి సారిగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన క్రీడాగదిని పరిశీలించారు. ఇక్కడ హెచ్ఎం కోటేశ్వర్‌రావు, సీఆర్పీ సదానందం, చైర్మన్ శ్రీలత ఉన్నారు.

## ఓదెలను ఆదర్శ గ్రామంగా గుర్తించండి

ఓదెల, సెప్టెంబర్ 21: ఓదెల మారుమూల గ్రామంలో 190కి పైగా నేత్రాలను దానం చేసిన ఆదర్శ గ్రామంగా గుర్తించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు సదాశయ ఫౌండేషన్ శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. అవయవ, శరీర, నేత్రదానాలకు ప్రోత్సాహన్ని అందించాలని కోరారు. సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఇక్కడ ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి, ప్రతినిధులు మేర్గు సారంగం, వెంకటేశ్వర్లు, వేణు, మల్లేశం, నిఖిల్ తదితరులు ఉన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్21: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం పారిశుధ్య నిర్వహణపై కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల జీపీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశమై, మాట్లాడారు. పల్లెలన్నీ పచ్చదనం-స్వచ్ఛదనంతో కళకళలాడే విధంగా చూడాలన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల గురించి స్వచ్ఛ భారత్ మిషన్ కోర్డినేటర్ రాఘవులు వివరించారు. ఇక్కడ డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవోలు గోవర్దన్, షాబీర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

## హిందీ భాషపై పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబర్ 21: హిందీ పక్వాడాలో భాగంగా హిందీ భాషను ప్రోత్సహించేందుకు యాజమాన్యం శనివారం ఎన్టీపీసీలో ఉద్యోగులకు అవగాహన పోటీలు నిర్వహించింది. కోల్ భవన్‌లో హిందీ భాషలో వ్యాసరచన పోటీలు చేపట్టారు. ఈ పోటీలకు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ హిందీ దివస్ సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం సీనియర్ మేనేజర్ (అధికార భాష) ఆదేశ్‌కుమార్ ఈడీకి హిందీ పుస్తకాన్ని బహూకరించి ఈ నెల 28న హిందీ భాషపై జరిగే పోటీల గురించి వివరించారు.

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 21: రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం హన్మంతు అధ్యక్షతన రవీందర్ హిందీ పండిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ భాష ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

## వరి పంట పరిశీలన

కమాన్‌పూర్, సెప్టెంబర్ 21: జూలపల్లిలో వరి పంటను ఏవో రామకృష్ణ శనివారం పరిశీలించారు. బ్యాక్టీరియా తెగులును గుర్తించారు. నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 400గ్రాములకు స్టెప్టోమైసిన్ సల్ఫేట్ 60గ్రాములు కలిసి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. తెగులను తొలి దశలోనే గుర్తిస్తే నత్రజని ఎరువును వేయడం ఆపేయాలన్నారు. అలాగే ఆకునల్లి నివారణకు స్పిరోమెసిఫెన్ 22.9 శాతం ఎస్‌సి మందును 200 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.

## లేబర్‌కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 21: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దు కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం పిలుపునిచ్చారు. శనివారం సంఘం కార్యాలయంలో పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు తోకల రమేశ్, దేవరాజ్, రాంప్రసాద్, శంకర్, రాములు, రాజేశ్వర్, రాయమల్లు, భీమయ్య ఉన్నారు.

## గణిత సామగ్రి అందజేత

జూలపల్లి, సెప్టెంబర్ 21: తేలుకుంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు సంజీవరెడ్డి శనివారం గణిత సామగ్రి అందజేశారు. ఇక్కడ హెచ్ఎం రవీందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ జనుప రజిత, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-All

CHANGE OF NAME

★I, Raikanapata Devika W/o. Raikanapeta Anjaiah H.No.9-5-124/1, Bhagavantharao Nagar, Vemulawada Rajanna Sircilla . My Husband Surname was Changed as Raikanapata Devika W/o. Raikanapata Anjaiah.
NTK-333472

CHANGE OF NAME

★I, Raikanapata Anjaiah S/o. Ruikamananapeta Hanmanth, Mother Name: Ruikamananapeta Laxmi, Wife Name Ruikamananapeta Devi (Old Names) H.No.9-5-124/1, Vemulawada Rajanna Sircilla . My Father, Mother, Wife Names Changed as Raikanapata Hanmanthu, Raikanapata Laxmi, Raikanapata Devika (New Names)
NTK-333474

BUSINESS OFFER

★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189